# మహనీయుడు బసవేశ్వరుడు

**జిల్లా రెవెన్యూ అధికారి సంగీత**
**గ్రామాలు, పట్టణాల్లో బసవేశ్వర జయంతి**



రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బసవేశ్వరుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు

ఆదిబట్ల, ఏప్రిల్ 30: సమాజ అభివృద్ధికి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడు అని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. బుధవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బసవేశ్వరుడి జయంతిని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో సంగీత, బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, ఏవో సునిల్‌కుమార్ కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త**
షాద్‌నగర్‌రూరల్ : బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త, సామజిక తత్వవేత్త, విశ్వగురువు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బసవ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని మల్లికార్జున కాలనీలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కుల, మత, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అన్నారు. అదేవిధంగా వీరశైవ సమాజం షాద్‌నగర్ అధ్యక్షుడు ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు బస్వం, ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. లింగవివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది, చిన్నతనంలోనే శివపురాణం గాథలను అవగతం చేసుకన్న మహనీయుడు బసవేశ్వరుడు అన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ చింటు, వీరేశం, వీరశైవ సమాజం, సభ్యులు పాల్గొన్నారు.

**మంచాలలో**
మంచాల : మండల కేంద్రంలోని చెరువుకట్టపై ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి మంచాల మండల వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే తనయుడు అభిషేక్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, నరేందర్‌రెడ్డి, భిక్షపతి, రమాకాంత్‌రెడ్డి, శేఖరప్ప, హరీశ్, పరమేశ్ పాల్గొన్నారు.

**చేవెళ్లటౌన్ :** మండల కేంద్రంలో బసవేశ్వర జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశాడని, విద్యారంగంలో స్త్రీలకు చదువు చెప్పించడం, మూఢనమ్మకాలపై నిరంతరం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నందిగామ :** మండల కేంద్రంలో బుధవారం బసవేశ్వర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు నరేందర్, విశ్వం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, నాయకులు శ్రీనివాస్, బస్వం, శేఖరప్ప, నర్సింహులు, సతీశ్, లింగం, మహేశ్, రవి, సురేశ్, రాములు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వరుని విగ్రహానికి ఘనంగా పూజలు చేశారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ నాయకులు శివకుమార్, విశ్వనాత్, ఆనందప్ప, పవన్, కిరణప్ప, శశిదరప్ప, అరవింద్, యాదప్ప, రవి, విజయ్, కిశోర్ ఉన్నారు.

**షాబాద్ :** మండల కేంద్రంలో జరిగిన బసవేశ్వరుడి జయంతి కార్యక్రమానికి రాష్ట్ర హాకీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ పట్నంశెట్టి జ్యోతి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై బసవేశ్వరుడి విగ్రహానికి పూజలు చేశారు. వీరితో పాటు వీరశైవ లింగాయత్ సమాజం పెద్దలు లింగప్ప, మల్లికార్జున్, సుధీర్, రవికుమార్, నవీన్, ప్రదీప్, మల్లేష్, పర్షవేది, వీరేశ్, రాజేష్, శ్రావణ్, జగదీశ్, దీపక్, విశ్వనాథ్, సర్వేశ్ పాల్గొన్నారు.

# ‘పది’ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కడ్తాల్, ఏప్రిల్ 30: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, కేవలం 181 మంది విద్యార్థులు పాసై 51.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 82 మంది విద్యార్థులకు 38 విద్యార్థులు పాసవ్వగా, బాలికల ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 20 మంది విద్యార్థినులకు ఆరుగురు పాసయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో 42 మందికి 35 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో కరిష్మా 514 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఏక్వాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 8 మంది పాసవ్వగా, ముద్విన్ ప్రభుత్వ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. రావిచేడ్ పాఠశాలలో 32 మందికి 23, చరికొండ పాఠశాలలో 22 మంది విద్యార్థులకు ఏడుగురే పాసయ్యారు. మైసిగండి గిరిజన పాఠశాలలో 47 మంది విద్యార్థులకు 36 మంది ఉత్తీర్ణులుకాగా, 516 మార్కులతో కడావత్ మహేశ్ టాపర్‌గా నిలిచాడు. కేజీబీవీ పాఠశాలలో 34 మంది విద్యార్థినులకు 28 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు.

**మాడ్గుల :** మండలంలోని 452 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 415 మంది ఉత్తీర్ణులు కాగా, 37 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు మాడ్గుల ఎంఈవో సర్దార్‌నాయక్ తెలిపారు. 91.8 శాతం ఉత్తీర్ణులు అయినట్లు చెప్పారు. రాజమౌళి అశ్వినికి 565 మార్కులు, సౌమ్యశ్రీకు 560, స్పందనకు 559, మహమ్మద్ జునైద్‌కు 554, శ్వేతకు 554, స్నోహిత్‌కు 553 వచ్చినట్లు తెలిపారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు టీజీడబ్ల్యూఆర్‌జేసీ (బాలికల) గురుకుల పాఠశాల విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభను చాటారు. ఇందులో 78 మంది ఉత్తీర్ణత సాధించి 99 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. 31 మందికి 500కు పైగా మార్కులు సాధించగా, అత్యధికంగా కె. శ్రీవాణి 579, జె.సింధు 578, కె.పల్లవి 555, బి. శృతి 554, సిరివెన్నెల 548 మార్కులు సాధించారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, బాటసింగారం, మజీద్‌పూర్, బండరావిరాల, ఎంజేపీటీడబ్ల్యూఆర్ 100శాతం, అనాజ్‌పూర్ 98శాతం, ఎంజేపీ టీడబ్ల్యూఆర్ గర్ల్స్ మునుగనూరు 97శాతం, ఎంజేపీ టీడబ్ల్యూఆర్ ఎల్బీనగర్ 96శాతం, కోహెడ 80, ఇంజాపూర్72, తొర్రూర్ 71.25, కుత్బుల్లాపూర్ 70, రాగన్నగూడ 69.70, తుర్కయాంజాల్ 64.70, పసుమాముల 56, తారామతిపేట 54, తట్టిఅన్నారం 52, పెద్దఅంబర్‌పేట 48, కుంట్లూర్ 45.45 ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి జగదీశ్వర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

**చేవెళ్లటౌన్ :** చేవెళ్ల మండలంలోని ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 500మంది విద్యార్థులు పరీక్ష రాయగా 379 మంది ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 100 మందికి 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో 45 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

**మొయినాబాద్ :** మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు 744 మంది పరీక్షలు రాయగా, 564 మంది ఉత్తీర్ణత సాధించారు. చిన్నమంగళారం జిల్లా పరిషత్ పాఠశాలలో 83శాతం, కనకమామిడి 80, బాకారం 80, రెడ్డిపల్లి 80, హిమాయత్‌నగర్ 78, వెంకటాపూర్ 76, కేతిరెడ్డిపల్లి 75, అమ్డాపూర్ 72, అజీజ్‌నగర్ 68, ఎన్కేపల్లి 67, పెద్దమంగళారం 64, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం 64, మేడిపల్లి 57, చిలుకూరు 50, చందానగర్ 43, తోలుకట్టా పాఠశాలల్లో 37 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిన్నమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాత్రం 83 శాతం సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా తోలుకట్టా పాఠశాల 37శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించి చివరి స్థానంలో ఉన్నది. కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గౌతమి 525 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో 95 శాతం ఫలితాలను సాధించారు. 76 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. టి. యశ్వంత్ 565 మార్కులు, కే శ్రీకాంత్ 565 మార్కులను సాధించారు. అదే విధంగా ఎం.సందీప్‌కుమార్ 560మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

**చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో..**
మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలిక పాఠశాల విద్యార్థినులు 95 శాతం ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల నుంచి 78 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 74 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. 10వ తరగతిలో పి అఖిల 561, కె.అనూష 554, బిందుమాధవి 548, వి.ఆమూల్య 548కే అంజలి 540 మార్కులు సాధించారు. ఇందులో కె.అనూష 554 మార్కులు సాధించగా, తెలుగులో మాత్రం 100కు 100 మార్కులు వచ్చినట్లు తెలిపారు. అదే విధంగా జె. నందిని 100కు 100 మార్కులు సాధించింది. పాఠశాలలో అఖిల 561 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది.

**కేశంపేటలో..**
కేశంపేట : మండలంలోని కేశంపేట, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు పలు పాఠశాలల్లో 548మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 73.9శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో రితీశ్‌రెడ్డి 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. జెడ్పీహెచ్ఎస్ పాపిరెడ్డిగూడ అర్చన 546, జెడ్పీహెచ్ఎస్ కేశంపేట విద్యార్థి వరుణ్ 530, జెడ్పీహెచ్ఎస్ కొత్తపేట ఓంకార్ 525 సాధించారు.

## నలంద ప్రభంజనం



ఆదిబట్ల, ఏప్రిల్ 30: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు నలంద పాఠశాల విద్యార్థులు బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. రమావత్ అక్షితకు 584 మార్కులు రాగా, నాజియా 568 మార్కులు సాధించింది. పాఠశాలలో 37 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్ తెలిపారు.

# నిబంధనలకు లోబడి ఇండ్ల కేటాయింపు



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 : ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దారిద్రరేఖకు దిగువ ఉన్న అర్హులైన వారందరికీ నిబంధనలకు లోబడి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తమ బాధ్యత అన్నారు. ఫేస్-1లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి 4వేల ఇండ్లు ఇస్తామని అన్నారు. అలాగే, ఇండ్లు మంజూరైన వారంతా సకాలంలో నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని అన్నారు.

**కమిటీ మెంబర్లను మార్చుతాం..**
గ్రామాల్లో పేదలను గుర్తించి వారికి ఇండ్లు ఇప్పించాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొని అర్హులకు ఇండ్లు ఇప్పించేందుకు కృషిచేయాలన్నారు. పనిచేయకుండా కాలయాపన చేసేవారిని అవసరమైతే మార్చేసి కొత్తవారిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, పలువురు వార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట, ఏప్రిల్ 30: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో అధికారులు బుధవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను చేశారు. ఈ సందర్భంగా కేశంపేట డిప్యూటీ తహసీల్దార్ గీత లబ్ధిదారులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. గ్రామానికి 36ఇండ్లు మంజూరయ్యాయని, అందుకు సంబంధించి లబ్ధిదారులు అర్హులేనా? అన్న విషయమై విచారణ చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షపతి, గ్రామస్తులు కృష్ణారెడ్డి, శివయ్య, సుందరయ్య, నర్సింహులు, శంకర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



## ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

**తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**

నందిగామ, ఏప్రిల్30: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హశాంతి వనంలో శ్రీరామచంద్ర మిషన్ రెండో గురువు బాబుజి మహరాజ్ జయంతిని బుధవారం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై ధ్యానం చేసి కన్హలో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ధ్యానంతో ప్రశాంత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కన్హ ప్రతినిధులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50000 అభ్యసిలు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో మ్యుటేషన్ చేయాలి



భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

కొందుర్గు, ఏప్రిల్ 30: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో రైతుల రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారం అవుతాయని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. చౌదరిగూడ మండలంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. సక్సేషన్, మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో తహసీల్దార్ విచారణ చేసి మ్యుటేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, కొందుర్గు, చౌదరిగూడ తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, ఏడీఏ రాజారత్నం, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు రాజు, పురుషోత్తంరెడ్డి, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

## మట్టి దిబ్బను తొలగించండి

కేశంపేట, ఏప్రిల్ 30: మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఓ వ్యక్తి సీసీరోడ్డును కబ్జా చేసి మట్టి దిబ్బను వేయించి ప్రజల రాకపోకలకు అడ్డంకులు సృష్టిస్తున్నాడని గ్రామస్తులు బుధవారం కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సీసీరోడ్డు ఉన్న స్థలాన్ని కబ్జా చేశాడన్నారు. ఆ రహదారి గుండా ప్రజలు రాకపోకలు సాగించేవారని, సీసీరోడ్డు ధ్వంసం కావడంతో కబ్జాకు పాల్పడ్డాడన్నారు. సీసీరోడ్డుకు ఆనుకొని గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటార్‌తోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉందన్నారు. మట్టి దిబ్బ విషయమై పంచాయతీ గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా, తొలగిస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి మట్టి దిబ్బను తొలగించి సీసీరోడ్డును పునరుద్ధరించాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో పాపయ్య, ఆంజనేయులు, షకీల్, యాదయ్య, తదితరులు ఉన్నారు.

# హార్టికల్చర్‌పై అవగాహన



చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 30 : చేవెళ్ల మండల పరిధి పల్గుట్ట గ్రామంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ మోజర్ల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ‘రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారు అనుసరిస్తున్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ పటం, నేల రకం, వ్యవసాయంలో సాంకేతికత, నిల్వ, దిగుబడిని పెంచడం, పూల మొక్కలు చామంతి, లిల్లీ, బంతి పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు సానియా, యు.అఖిల, సంతోష, లావణ్య, ప్రీతి, శారద, స్వాతి, రచన, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మేడే పోస్టర్ విడుదల



కేశంపేట, ఏప్రిల్ 30: మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు మేడే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేడే సందర్భంగా కేశంపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించే ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో రామస్వామి, బాల్‌రాజ్, రాజు, నర్సింహులు, యాదయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌పై లైంగికదాడికి యత్నం

**నిందితులను రిమాండ్‌కు తరలించిన కొత్తూరు పోలీసులు**

కొత్తూరు, ఏప్రిల్ 30: ఓ బాలికపై లైంగికదాడికి యత్నించిన ఇద్దరిని కొత్తూరు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కొత్తూరు పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెంజర్లలో ఏప్రిల్ 28న బాలిక ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన రమేశ్, కృష్ణయ్య బాలిక ఇంట్లోకి ప్రవేశించి బాలికపై లైంగికదాడికి యత్నించారు. దీంతో బాలిక వారి నుంచి తప్పించుకొని పక్కింటి వారికి చెప్పింది. అయితే చిన్నారికి తల్లిలేదు. తండ్రి తాగుడుకు బానిసయ్యాడు. నాయనమ్మ గుడ్డిది. దీంతో పక్కింటి వారి ఫిర్యాదు మేరకు కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను పట్టుకునేందుకు సీఐ నరసింహారావు ఓ టీమ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు గాలింపు చేపట్టి బీర్ల రమేశ్, గోదా కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించారు.

# మాడ్గులలో భారీ వర్షం

**కూలిన చెట్లు, తడిసిన వడ్లు**



మాడ్గుల, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని మాడ్గుల గ్రామం నుంచి కలకొండ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కల ఉన్న చెట్లు బుధవారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసి కలకొండ గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కలకొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు గోరెంట్ల మల్లేశ్‌యాదవ్ తన మిత్రులతో కలిసి చెట్లను తొలగించారు. నల్లచెరువు గ్రామంలో మల్లయ్య, అనిల్‌కుమార్, చంద్రయ్య వ్యవసాయ పొలంలో పోసిన వడ్ల రాసులు పూర్తిగా తడిసాయి.

## ఈదురు గాలులకు కూలిన ధ్వజస్తంభం



మండల పరిధి లష్కర్‌గూడ గ్రామంలోని శ్రీశ్రీ ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్థంభం మంగళవారం రాత్రి వచ్చిన ఈదురు గాలులకు కూలి ఆలయంపై ఒరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. ధ్వజ స్తంభాన్ని యథావిధిగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

- అబ్దుల్లాపూర్‌మెట్

# దరఖాస్తులను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 30 : గ్రామాల్లో రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు. బుధవారం శంకర్‌పల్లి ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్య పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మే 1వ తేదీన వెరిఫికేషన్ చేసి లబ్ధిదారుల వివరాల జాబితాను మండల కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ చోరీ.. నగదు బదిలీ

కడ్తాల్, ఏప్రిల్ 30: బస్సులో ఎక్కిన వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసి... ఫోన్‌పే నుంచి నగదును బదిలీ చేసుకున్న ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ గంగాధర్ వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ పరిధిలోని మీర్‌పేట్‌కు చెందిన మేకల కల్యాణ్ తన అనుచరులు ఆవుల శ్రీను, వెంకటరమణమ్మ, రాకేశ్‌తో కలిసి ఆటోలో ఏప్రిల్ 9న కడ్తాల్ మండల కేంద్రానికి వచ్చారు. ఉదయం 9 గంటలకు బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లడానికి బస్సు ఎక్కుతున్న కడ్తాల్ గ్రామానికి చెందిన సింహ్మయ్య సెల్‌ఫోన్‌ను దుండగులు చోరీ చేశారు. సింహ్మయ్య ఫోన్‌పే లాక్ నంబర్‌ను తెలుసుకొని అతడి అకౌంట్లో నుంచి రూ.82,600 వేరే అకౌంట్లోకు బదిలీ చేసుకున్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైందని బాధితుడు ఏప్రిల్ 11న ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టగా, 29న మరోసారి దొంగతనం చేయడానికి మేకల కల్యాణ్ తన ఆటోలో మైసిగండి ప్రాంతానికి వచ్చాడు. పోలీస్ సిబ్బంది రాంకోటి, రాజశేఖర్ సహకారంతో కల్యాణ్‌ను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచిన అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. వెంకటరమణమ్మ, రాకేశ్, శ్రీను పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి విరాళం

**అబ్దుల్లాపూర్‌మెట్ :** మండలంలోని అనాజ్‌పూర్‌లో ముదిరాజ్ కులస్తులు నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి రూ.2.51లక్షలను బుధవారం ఆలయకమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

కొందుర్గు, ఏప్రిల్ 30: చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల పంచాయతీ పరిధిలోని వీరసముద్రంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవికుమార్ బుధవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ప్రగతిలో భాగస్వామ్యం కావాలన్న ఉద్దేశంతో విరాళం అందజేయడం జరిగిందన్నారు. ఆయన వెంట నర్సింహులు, యాదయ్య, యాదయ్య, గోపాల్, కృష్ణయ్య, నర్సింహులు, మల్లేశ్, శ్రీను పాల్గొన్నారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేశంపేట, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో అనిల్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యేతోపాటు పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవానికి మండలంలోని ఆయా గ్రామాల నేతలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కారు బీభత్సం.. పలువురికి గాయాలు



పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 30: హైవేపై కారు అతివేగంతో బీభత్సం సష్టించింది. పలు వాహనాలను ఢీకొట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలి గోపన్‌పల్లికి చెందిన ఎం వెంకట రమణ భార్య ప్రదీపతో కలిసి కారు రిజిస్ట్రేషన్ కోసం సొంతూరు సూర్యాపేట జిల్లాలోని కోదాడకు కారులో వెళ్తున్నారు. బుధవారం ఉదయం ఓ కారు నగరం నుంచి హైదరాబాద్ వెళ్తూ.. పెద్దఅంబర్‌పేట సంపూర్ణాహోటల్ సమీపంలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఆపై హైవేపై అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న వెంకటరమణకు చెందిన కారుతోపాటు ఓ యాక్టివ, బైక్‌ను ఢీకొట్టింది. వెంకటరమణ, ప్రదీపతోపాటు ద్విచక్ర వాహనాలపై ఉన్న లింగస్వామి, నవనీత, చిన్నారులు శాన్వి, ఏడాదిన్నర బాలుడికి గాయాలయ్యాయి. యాక్టివ నడుపుతున్న మల్లారెడ్డికి కూడా గాయాలయ్యాయి. వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.